క్లుప్తంగా

అంగన్‌వాడీ విభాగం జనరల్ సెక్రటరీ కృతజ్ఞతలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీవిద్య

అద్దంకి: వైఎస్సార్ సీపీ ఏపీ రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం జనరల్ సెక్రటరీగా నియమితులైన కుంచాల శ్రీ విద్య శనివారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై విశ్వాసం ఉంచి పదవి ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ పెద్దలకు, మండల నియోజకవర్గ నాయకులకు కృతజ్ఞలు తెలియజేశారు. పార్టీలో బలోపేతానికి, అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తానని చెప్పారు. హనిమిరెడ్డిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు.

సర్వేయర్ల వినతిపత్రం సమర్పణ



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సర్వేయర్లు

జె.పంగులూరు: రాష్ట్ర వ్యాప్తంగా సమస్యలు ఎదుర్కొంటున్న విలేజ్ సర్వేయర్లకు న్యాయం చేయాలని శనివారం పంగులూరు మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హేతు బద్ధీకరణ చేస్తున్న సర్వేయర్లకు వారి సమ్మతితో కౌన్సిలింగ్ జరగాలన్నారు. ప్రమోషన్ ఇచ్చి బదిలీ చేయాలని తెలిపారు. సర్వే డిపార్టెమెంట్ ఉద్యోగులందరికీ టెక్నికల్ డిపారచేస్తూ స్కేల్ ఇవ్వాలని కోరారు.

బాల్య వివాహాలపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న బాలికలు

పర్చూరు (చిన్న గంజాం): నూతలపాడు సెక్టార్ పరిధిలో కిషోర్ బాలికలకు అంగన్‌వాడీ కార్యకర్తలు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. శనివారం విజ్ఞాన్ పాఠశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాల వలన జరిగే నష్టాల గురించి వివరించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్రలపై ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్ బి. సునంద, అంగన్‌వాడీ కార్యకర్తలు మాధవి, సుభాషిణి, రత్నకుమారి, కృష్ణవేణి, సునీత, సువర్ణ, క్రాంతి కుమారి విజ్ఞాన్ పాఠశాల ప్రిన్సిపాల్ సుందర్ రాజు పాల్గొన్నారు.

ఘనంగా శివ పార్వతుల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న జంటలు

బల్లికురవ : శివపార్వతుల కల్యాణం చూసిన చేసిన అష్టైశ్వర్యాలతోపాటు ఆయుష్షు పెరుగుతుందని చెన్నుపల్లి గంగాపార్వతీ సమేత పరుసవేదీశ్వరస్వామి ఆలయ అర్చకుడు స్వర్ణ రాంబాబు, అయ్యప్ప దీక్షితులు తెలిపారు. శనివారం ఆలయంలో 21వ శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని గణపతికి ప్రత్యేక పూజలు, అలంకరణ, పుణ్యాహవచనం, శివపార్వతులకు పంచామృతులతో అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వేదికపై ఉంచి వేదమంత్రోచ్ఛరణలతో కమనీయంగా నిర్వహించారు.

యోగాంధ్ర ఎవరి కోసమో!

ఇది ప్రభుత్వ కార్యక్రమమా ?
రాజకీయ పార్టీ కార్యక్రమమా?

- కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించని అధికారులు
- ప్రజా ప్రతినిధులను ఆహ్వానించకుండానే ప్రభుత్వ కార్యక్రమం
- ఎంపీపీ, జెడ్పీటీసులను సైతం పట్టించుకోని అధికారులు



మండల స్థాయి యోగాంధ్ర కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్న దృశ్యం

చినగంజాం: ప్రజా స్వామ్యంలో ప్రజా ప్రతినిధులకు ప్రాముఖ్యత నివ్వకుండా ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించిన ఘనత చినగంజాం మండల స్థాయి అధికారులకు మాత్రమే దక్కింది. శనివారం నాడు మండల స్థాయిలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని రాజకీయ సభగా మార్చేశారు అధికారులు. యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి పూర్తి నిర్వాహణ బాధ్యతలు ఎంపీడీఓలకు అప్పగించగా శనివారం నాటి కార్యక్రమాన్ని పూర్తి రాజకీయ ప్రతినిధులకు ప్రాధాన్యమిస్తూ కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా కోట్ల రూపాయలు వెచ్చించి నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం దేశంతో పాటు రాష్ట్రంలో యోగాంధ్ర పేరుతో నిర్వహించారు. యోగాంధ్ర నిర్వాహణ కోసం జిల్లా, మండల స్థాయిలో ప్రత్యేకంగా నిధులు సమృద్ధిగా కేటాయించి అత్యంత ఘనంగా ఏర్పాట్లు చేశారు. అయితే చినగంజాం మండల పరిధిలో అధికారులు మాత్రం మండల స్థాయిలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమానికి ప్రోటోకాల్ పాటించకుండా కేవలం రాజకీయ నాయకులను, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు కొద్ది మందిని మాత్రమే ఆహ్వానించి ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో యోగాపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు.

కనీసం ఆహ్వానం కూడా లేని ఎంపీపీ, జెడ్పీటీసీ

గ్రామ పంచాయతీ స్థాయిలో సర్పంచ్ ఆయా పంచాయతీల్లో యోగాంధ్ర నిర్వహించకున్నా లేకున్నా కనీసం మండల స్థాయి కార్యక్రమాన్ని ఆహ్వానించాల్సిన బాధ్యత ఎంపీడీఓకు, కార్యాలయ సిబ్బందిపై ఉంది. ముఖ్యంగా మండలానికి మొదటి పౌరుడుగా చెప్పుకునే ఎంపీపీని, జిల్లా స్థాయిలో మండలానికి ప్రాతినిధ్యం వహించే జెడ్పీటీసీని సైతం అధికారులు కార్యక్రమానికి ఆహ్వానించక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది. చినగంజాం మండల ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి, జెడ్పీటీసీ ఆసోది భాగ్యలక్ష్మిలను మండల స్థాయి కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు అయినప్పటికీ పిలవక పోవడంపై అధికార పార్టీ నాయకుల వత్తిడికి అధికారులు తలొగ్గి ఇటువంటి బాధ్యతా రాహిత్య చర్యలకు పాల్పడి ఉండారని ప్రజలు విమర్శిస్తున్నారు. మండల స్థాయిలో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమంలో అధికార టీడీపీకి చెందిన నాయకులు, మహిళా నాయకులు మాత్రమే వేదికపైకి ఆహ్వానించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో రాజకీయ కోణం దాగి ఉందని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

వేధింపులు మానుకోవాలి



రామాంజనేయపురంలో సమస్యలను తెలుసుకుంటున్న హనిమిరెడ్డి



కొప్పరపాలెం సర్పంచ్ భర్తను పరామర్శిస్తున్న హనిమిరెడ్డి

బల్లికురవ: కూటమి పాలనలో బడుగు బలహీన వర్గాలపై అధికారుల వేధింపులు అధికమయ్యాయని అద్దంకి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రామాంజనేయపురం గ్రామంలో ఇటీవల అధికారుల వేధింపులతో ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన నాగిపోగు ఏసురత్నంను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ సందర్భంలో ఆ గ్రామానికి చెందిన ప్రజలు ఉపాధి హమీపథక కూలీలు హనిమిరెడ్డికి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వినతి పత్రాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశామన్న అక్కసుతో తమకు ఉపాధిహమీ పథకంలో పనులు కల్పించటం లేదని ఆపథక ఏపీవో రమాదేవికి విన్నవించిన పట్టించుకోవటం లేదని కూలీలు వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్ స్థానంలో కూటమి నేతలు, మేట్‌తో తమకు అనుకూలమైనవారికి ఎక్కువ కూలీ నమోదు చేయిస్తున్నారని వివరించారు. ఏపీవోతో హనిమిరెడ్డి ఫోన్‌లో మాట్లాడుతూ తక్షణమే గ్రామాన్ని సందర్శించి కూలీలు అందరికి పనులు కల్పించాలని లేనిచో కూలీలు అందరిని బాపట్ల తీసుకెళ్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానమన్నారు.

సర్పంచ్ అకాల మరణం బాధాకరరం

గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న సర్పంచ్ గుండె పోటుతో అకాల మరణం చెందటం బాధాకరమని హనిమిరెడ్డి అన్నారు. శనివారం రెండు రోజుల క్రితం చనిపోయిన కొప్పరపాలెం సర్పంచ్ వల్లంరెడ్డి అమల ఇంటికి వెళ్లి భర్త అంజిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అమల చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, ముక్తేశ్వరం మాజీ సర్పంచ్ కొణుదుల శంకరరెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

యోగా ప్రక్రియ అద్భుతం

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



అద్దంకి: యోగాభ్యాసనలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



చీరాల : యోగాంధ్ర కార్యక్రమంలో సూచనలందిస్తున్న చీరాల ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు



పర్చూరులో యోగా ఆంధ్రా దినోత్సవం నిర్వహిస్తున్న అధికారులు

చీరాల టౌన్: విద్యార్థి దశ నుంచే ప్రతి రోజూ విధిగా యోగా చేయడం వలన శారీరక రుగ్మతలు తొలగి మానసిక ప్రశాంతతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమాన్ని శనివారం మండలంలోని వాడరేవు జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించారు. యోగా శిక్షకులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు ఆసనాలు వేయించారు. ఆసనాలు వేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21న ప్రపంచమంతా జరుపుకుంటోందన్నారు. కారంచేడులోని అన్ని గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు యద్దనపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే యోగాసనాలు,సూర్య నమస్కారాలు చేయించారు. మేదరమెట్లలో శనివారం ఘనంగా నిర్వహించారు. వేటపాలెంలో వివిధ ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలు, హైస్కూల్స్‌లో 11 అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. జె.పంగులూరు మండల పరిధిలోని పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. మార్టూరులో స్థానిక మద్ది సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చినగంజాంలో తహసీల్దార్ జి. ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్చూరులో పాఠశాలల్లో యోగాంధ్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల తహసీల్దార్ ప్రతి రోజూ క్రమం తప్పకుండా యోగాసనాలు చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని అద్దంలో మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి డి. వెంకట లక్ష్మి అన్నారు. శనివారం యోగా డే ని స్థానిక కోర్టు భవన సముదాయంలో ఘనంగా నిర్వహించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



స్వర్ణ గ్రామంలో మొక్కలు నాటుతున్న తహసీల్దారు నాగరాజు, సర్పంచ్ మధుసూదనరావు

స్వర్ణ (కారంచేడు): గ్రామాల్లో స్వచ్ఛమైన గాలి, వెలుతురు కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటుకోవాల్సి ఉందని తహసీల్దారు జి. నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని స్వర్ణ గ్రామంలో గ్రామ సర్పంచ్ మోటాని మధుసూధనరావు అధ్యక్షతన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంను నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని లేదంటే మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబల కుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దోమలు వ్యాప్తి చెందకుండా వాడి పడేసిన కొబ్బరి బోండాలు, టీకప్పులు, పూల కుండీలు వంటివి తీసి పడేయాలన్నారు. హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు, గ్రామ సర్పంచ్ మధుసూదనరావు, కార్యదర్శి ఆశా జ్యోతి, వైద్య సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

హోమియో వైద్యుడికి అభినందనలు



మొక్కలు నాటుతున్న దృశ్యం

పర్చూరు (చిన్నగంజాం): స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఉప్పుటూరు హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ జెడ్పీ హై స్కూల్లో మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటినట్లు తెలిపారు. ఇప్పటి వరకు యోగాలో చూపిన ఆశక్తిని ఈ రోజుతో ముగించకుండా తమ దైనందిన జీవితంలో భాగస్వామ్యం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని ఆయన ఆకాంక్షించారు. మండలంలో నిర్దేశించిన 200 యోగా వేదికల్లో ఇన్‌చార్జిలు యోగా నిర్వహించారని తెలిపారు. యోగాలో ప్రతిభ కనబర్చిన చంద్రశేఖర్ శనివారం బాపట్ల జిల్లా, సూర్యలంక బీచ్ వద్ద జరిగిన యోగాంధ్రలో పాల్గొనగా ఆయనకు ఎమ్మెల్యే వేగేసేన నరేంద్ర వర్మ, కలెక్టర్ జె. వెంకట మురళి ఘనంగా అభినందించినట్లు చెప్పారు. ఉప్పుటూరు సర్పంచ్ ఎర్రాకుల తిరుమలేశ్వరరావు, ఈల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చీరాల టౌన్: పంచాయతీల కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి పంచాయతీలను అభివృద్ధిలో ఉంచాలని ఎంపీడీఓ బి.శివన్నారాయణ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లుతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలను తనిఖీలు చేసి పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు వచ్చిన అర్జీలను నిశితంగా విచారించి అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం అందించాలన్నారు. గ్రామ సచివాలయాల ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని కోరారు. సచివాలయం ద్వారా అందించే సేవలను నిర్ణీత సమయంలోగా అర్జీదారులకు అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు విధిగా అందించడంతో పాటు సచివాలయానికి వచ్చే ప్రజలకు జవాబుదారీగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలు కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ఇంటిపన్ను వసూళ్లు వేగవంతం చేసి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు అందించే సేవల్లో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పల్లె వెలుగు బస్సులకు బ్రేక్

బల్లికురవ: అంతర్జాతీయ యోగా దినోత్సవం (యోగాంధ్ర) సందర్భంగా బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో తిరిగే పల్లె వెలుగు బస్సులకు గురువారం రాత్రి నుంచి బ్రేక్ పడింది. శనివారం ఉదయం విశాఖపట్టణంలో జరిగే యోగాంధ్రకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరైన విషయం తెలిసిందే.ఈ కార్యక్రమానికి ఆ ప్రాంత ప్రజలను యోగాలో భాగస్వాములను చేసేందుకు అద్దంకి, వినుకొండ, నరసరావుపేట, చిలకలూరిపేట డిపోలకు చెందిన 100 పైచిలుకు పల్లె వెలుగు బస్సులను విశాఖ పంపారు. ఆదివారం మధ్యాహ్నానికి ఈ బస్సులు తిరిగివచ్చే అవకాశం ఉంది. దీంతో మూడు రోజులపాటు బస్సుల రద్దుతో ప్రయాణికులు పడరాని పాట్లు పడాల్సిందే. అద్దంకి డిపో నుంచి గోవాడ, బల్లికురవ మీదుగా చిలుకలూరిపేట వెళ్లే బస్సు, వైదన బల్లికురవ మీదుగా చిలకలూరిపేట వెళ్లే బస్సు, మైలవరం బస్సు, బల్లికురవ- సంతమాగులూరు మీదుగా నరసరావుపేట వెళ్లే సింగిల్ రూట్‌బస్సులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. అద్దంకి నుంచి కొమ్మాలపాడు, సంతమాగులూరు మీదుగా నరసరావుపేట బస్సులను, కొప్పరపాడు, నాగులవరం మీదుగా వినుకొండ వెళ్లే బస్సులు కుదించారు. చిలకలూరిపేట డిపో నుంచి మార్టూరు, బల్లికురవ, కొమ్మాలపాడు మీ దుగా కుందుర్రు వెళ్లే సింగిల్ బస్సును మూడు మండలాల్లోని ప్రయాణికుల అభ్యర్థనల మేరకు రద్దు చేయకుండా యథావిధిగా నుపుతున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

యద్దనపూడి: ద్విచక్ర వాహనం చోరీచేసిన వ్యక్తిని యద్దనపూడి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై రత్నకుమారి తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లిపాడు గ్రామానికి చెందిన పాలపర్తి నాగరాజు అనే వ్యక్తి ఈ నెల 20 వ తేదీ రాత్రి అనంతవరం లక్కీ రోడ్డు లైన్స్ వద్ద ఉన్న ఓ కంపెనీ ఆవరణలో ఉంచిన ద్విచక్ర వాహనాన్ని , మోబైల్ ఫోన్‌ను చోరీ చేశాడు. ఈ నేపథ్యంలో వచ్చిన ఫిర్యాదు మేరకు నిఘా పెట్టిన పోలీసులు పాలపర్తి నాగరాజు అనే వ్యక్తి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. శనివారం మధ్యాహ్నం తాతపూడి బ్రిడ్జి వద్ద నాగరాజును అదుపులోకి తీసుకొని ద్విచక్ర వాహనాన్ని, మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పర్చూరు కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై పలు కేసులున్నాయని ఎస్సై తెలిపారు.

పర్చూరులో స్వల్ప అగ్నిప్రమాదం

పర్చూరు (చిన్నగంజాం): పర్చూరులోని వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న మూతబడిన ఎంఆర్ఆర్ పాఠశాలలో శనివారం స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. వాచ్‌మెన్ గదిలో ఉదయం 10 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చీరాల నుంచి అగ్నిమాపక సిబ్బందిని రప్పించి మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదంలో గదికి ఉన్న తలుపులతో పాటు లోపల ఉన్న కొన్ని చెక్క బల్లలు కూడా పూర్తిగా కాలిపోయాయి.

కమ్యూనిస్టుల పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న జల్లి విల్సన్

సంతమాగులూరు(అద్దంకి): కమ్యూనిస్టుల పోరాటాలతోనే దేశంలో సమస్యల పరిష్కారం జరుగుతోందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జల్లి విల్సన్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏడో మహాసభ సంతమాగులూరు మండలంలోని కొమ్మలపాడు గ్రామంలో పాత పోలీస్ స్టేషన్ గ్రౌండ్ లో శనివారం నిర్వహించారు. ఈ మహాసభ ప్రారంభానికి ముందుగా బ్యాంకు నుంచి సీపీఐ కార్యకర్తలు బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన చేసి బస్టాండ్ సెంటర్లో జెండా ఆవిష్కరించారు. ఈ మహాసభకు అధ్యక్షులుగా మల్లెల ఏసోబు ప్రారంభకులుగా వ్యవహరించారు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ గారు ప్రసంగిస్తూ ప్రజాసమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ కమ్యూనిజం ఉంటుందని అన్నారు. హామీ ఇచ్చిన పథకాలు అమలు చేయకుండా ప్రక్కతోవ పట్టించేందుకు, నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోగా పేరుతో డ్రామాలాడుతున్నాయని అలవికాని హామీలు ఇచ్చి హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయన్నారు. ఒకప్పుడు పార్లమెంటులో వ్యవసాయ కార్మికులకు పెన్షన్ స్కీం కావాలని అడిగినప్పుడు అందరూ నవ్వి మాట్లాడారని అదే పింఛన్ స్కీములను అమలు చేయడంలో నేటి ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్నటువంటి కార్మిక మత విధానాల వలన దేశం యొక్క అభివద్ధి కుంటుపడుతుందన్నారు. జిల్లా సెక్రటరీ తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో అనేక సమస్యలతో రైతాంగం తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక వ్యవసాయం చేయడానికి భయపడుతున్నారన్నారు. జిల్లాలో మంచినీటి పథకాలు అన్ని చాప చుట్టాయని ఎక్కడా కూడా రక్షిత మంచినీటి పథకాలు పనిచేసిన అరకొరగా పనిచేస్తున్నాయన్నారు. సూపర్ సిక్స్‌లో భాగమైన పల్లెల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం ఈరోజు కూడా పేద ప్రజలకు దక్కలేదని టిడ్కో గృహ లబ్ధిదారులకు ఇప్పటికీ ప్రవేశం లభించలేదని తెలిపారు. ఐదు లక్షలు మంజూరు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షులు అద్దంకి నాగేశ్వరరావు అద్దంకి నియోజకవర్గ సీపీఐ పార్టీ ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్రరావు ఏఐటీయూసీ అద్దంకి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కార్యదర్శి ప్రసాదువ, మేకల వెంకాయమ్మ గర్నెపూడి ప్రసాదు షేక్ వలి కొండయ్య రమణయ్య వెంకటేశ్వర్లు నారాయణ షరీఫ్ ఎలమందయ్యా జైలవుద్దీన్ ధనలక్ష్మి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 21 మందితో కౌన్సిల్లో ఎన్నుకున్నారు. ఇందులో షేక్ ఖాదర్ బాషను సంతమాగులూరు మండల సీపీఐ కార్యదర్శిగా సహాయ కార్యదర్శులుగా మేకల రమణయ్య ధనలక్ష్మిని కౌన్సిల్ ఎన్నుకున్నారు.

గ్రామ సర్వేయర్ల పెన్‌డౌన్



ఇంకొల్లులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్వేయర్లు

ఇంకొల్లు (చినగంజాం): రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సర్వేయర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ ఇంకొల్లు మండలంలోని గ్రామ సర్వేయర్లు శనివారం పెన్డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంకొల్లు మండలంలోని గ్రామాల్లో పనిచేస్తున్న సర్వేయర్లు ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాసమూర్తిని కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని గ్రామ సర్వేయర్లు గుంజి తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు (చిన గంజాం): పర్చూరు మండల గ్రామ సర్వేయర్లు శనివారం పెన్ డౌన్ కార్యక్రమాన్ని చేపట్టారు. తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఒకరోజు విధులకు దూరంగా ఉన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నినాదాలు చేసి తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతి పత్రాన్ని అందించారు. తమకు పదోన్నతులు కల్పించి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్‌లో పని చేసేందుకు కావాల్సిన ల్యాప్‌టాప్, స్టేషనరీలను కూడా సమకూర్చడం లేదని తెలిపారు. గ్రామ సర్వేయర్ల సీనియారిటీ జాబితాను తయారు చేసి తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు వినతి పత్రంలో కోరారు.

5న జాతీయ లోక్ అదాలత్

పర్చూరు (చిన్న గంజాం): జూలై 5వ తేదీన పర్చూరు కోర్టు భవనాల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి పి. శాంతి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం స్థానిక పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. లోక్ అదాలత్ విజయవంతం అయ్యేలా అంతా కృషి చేయాలన్నారు. అర్జీదారులు, కక్షిదారులతో మాట్లాడి రాజీ మార్గంలో సమస్యలను పరిష్కరించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మరో పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

పర్చూరు (చిన్నగంజాం): పర్చూరులో రెండో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, బాపట్ల కలెక్టర్ వెంకట మురళితో కలిసి ప్రారంభించారు. రైతుల సౌలభ్యం కోసం శనివారం మార్కెట్ యార్డుకి ఎదురుగా ఉన్న మరో గోడౌన్లో కూడా పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నల్లబర్లీ పొగాకుని కొనుగోలు చేసేందుకు రాష్ట్రంలో ఇప్పటికే ఏడు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్క్ ఫెడ్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.